శని, ఆదివారాల్లో తెలంగాణ ప్రసిద్ధ ఆలయాలకు ప్రత్యేక బస్సు

మియాపూర్: ఆర్టీసీ మియాపూర్–1 డిపో పరిధిలో శని, ఆదివారాల్లో తెలంగాణలో ప్రసిద్ధ ఆలయాల తీర్థ యాత్రల నిమిత్తం రాజధాని ఏసీ బస్సులు నడపడం జరుగుతుందని డిపో మేనేజర్ మోహన్ రావు ఓ ప్రకటనలో తెలిపారు. తెలంగాణలోని స్వర్ణగిరి, యాదగిరిగుట్ట, జైనమందిర్, భద్రఖాళీ టెంపుల్, వెయ్యి స్తంభాల గుడి, మల్లూరు లక్ష్మీనరసింహాస్వామి ఆలయం, బొగ్గట్ట వాటర్ పాల్స్, మేడారం, రామప్ప ఆలయాల దర్శనాలకు శని, ఆదివారాల్లో రాజధాని ఏసీ ప్రత్యేక టూర్ ప్యాకేజీతో నడపడం జరుగుతుందని తెలిపారు. శనివారం ఉదయం 5 గంటలకు మియాపూర్ నుంచి బయల్దేరి దర్శనాలనంతరం ఆదివారం రాత్రి 10 గంటలకు మియాపూర్ డిపోకు చేరుకుంటుందని తెలిపారు. మరిన్ని వివరాలకు 98486 70640, 85008 09052, 96590 29882, 99592 26153లలో సంప్రదించాలని తెలిపారు.

పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అతిథులు

గచ్చిబౌలి: మానసిక ఆరోగ్యం–పిల్లల ప్రాణరక్షణ కోసం ప్రత్యేక రన్ కార్యక్రమాన్ని నవంబర్ 9న నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు శ్రీ టీఎంటీ సంస్థ సీఈఓ కరణ్‌గోయంక తెలిపారు. నవంబర్ 9న మానసిక ఆరోగ్యం–పిల్లల ప్రాణరక్షణ కోసం ప్రత్యేక రన్ పోస్టర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. ఆరంజ్ హబ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ..ఉదయం 6 గంటలకు శ్రీటిఎంటీ హైదరాబాద్–2025 10కె, 5కె రన్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు వివరించారు. మానసిక ఆరోగ్యంపై యువతలో అవగాహన పెంచడం, అలాగే ఆర్థిక ఇబ్బందుల వల్ల చికిత్స పొందలేని పేద చిన్నారులకు ప్రాణరక్షణ వైద్య సహాయం అందించడం, నిర్వాహకులు, ఈ కార్యక్రమాన్ని 5వేల మందికి పైగా రన్నర్లు పాల్గొంటారని ఆయన వివరించారు. ప్రతి అడుగు–ఆరోగ్యకరమైన ఆనందకరమైన భవిష్యత్తు కోసం అనే ట్యాగ్‌లైన్‌తో ఈ రన్ జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో లిటిల్ వన్స్ క్యూర్ ఫౌండేసన్ ట్రస్టీ నరేందర్ లక్కరాజు, ఏడి లైఫ్ ట్రస్ట్ ట్రస్టీ సభ్యులు డాలీ, ఆరంజ్ హబ్ వ్యవస్థాపకులు తబిట, ఆయా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

అధ్వాన రోడ్డుతో అవస్థలు



గోపన్‌పల్లి తండా నుంచి ఔటర్ రింగు రోడ్డు వరకున్న రోడ్డు గుంతలమయంగా మారింది. దీంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు రోడ్డుకు ఈ పరిస్థితి నెలకొంది. వర్షపు నీరు రోడ్డుపై ఉండే గుంతలలో నిలిచిపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. సెప్టెంబర్‌లోనే ఇలాంటి పరిస్థితి ఏర్పడితే ఇంకా వర్షాలు కురిసే అవకాశం ఉంటుందని అంచనా వేసుకొని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వెంటనే మరమ్మతులు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

– రాయదుర్గం

బీజేపీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్దాం

బీజేపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి



సేవా పక్షం కార్యక్రమంలో శ్రీనివాస్‌రెడ్డి

గచ్చిబౌలి: సేవే మా మంత్రం, అభివృద్ధి మా లక్ష్యం అనే నినాదంతో బీజేపీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు వనిపల్లి శ్రీనివాస్ రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం మసీద్‌బండలోని బీజేపీ కార్యాలయంలో సేవా పక్షం సమావేశాన్ని నిర్వహించారు. పక్షం రోజుల పాటు పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు వివిధ సేవా కార్యక్రమాలను విజవంతం చేయాలని సూచించారు. అక్టోబర్ 2 వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. 17న రక్తదాన శిబిరాలు, 18న విశ్వకర్మ జయంతి, 18న స్వచ్ఛ భారత్, 21న యోగా శిబిరాలు, పాదయాత్రలు, 25న పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ్ జయంతి, డిబేట్‌లు, క్విజ్ పోటీలు, క్రీడా పోటీలు,27న విద్యార్థులకు వ్యాస రచన, క్విజ్, వకృత్వం పోటీలు, 28న భారతమాతా, వీర మాతల సత్కారం, అక్టోబర్ 2న మహాత్మ గాంధీ జయంతి, శుభ్రత, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాల్సి ఉంటుందన్నారు. ఈ సందర్భంగా సేవా పక్షం రంగారెడ్డి జిల్లా కన్వీనర్ రాధాకృష్ణ యాదవ్ మాట్లాడుతూ..సమాజంలో మార్పు తీసుకొచ్చేందుకు ప్రతి కుటుంబాన్ని చేరడానికి కార్యక్రమాలు ఎంతగానో దోహదంచేస్తాయని అన్నారు. ప్రజల్లో చైతన్యం నింపేలా తెలంగాణ విమోచన దినోత్సవాన్ని నిర్వహించాల్సి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ విమోచన దినోత్సవ కమిటీ కన్వీనర్ కసిరెడ్డి భాస్కర్ రెడ్డి, బీజేపీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శులు మహిపాల్‌రెడ్డి, యశ్‌పాల్ గౌడ్, ఉపాధ్యక్షులు మూల అనీల్ గౌడ్, స్రవంతి, కార్యదర్శులు మణి భూషన్, మాణిక్‌రావు, దుర్గా ప్రసాద్, సేవా పక్షం కో కన్వీనర్‌మార్ యాదవ్ పాల్గొన్నారు.

భవనం పైనుంచి కిందపడి వ్యక్తి మృతి



సింహయ్య(ఫైల్)

మియాపూర్: భవనం మూడో అంతస్థు వద్ద పనిచేస్తుండగా ఓ వ్యక్తి కిందపడి గాయాలపాలై మృతిచెందిన ఘటన మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం..శ్రీకాకుళం జిల్లా నందిగామ మండలం బోరుభద్ర గ్రామానికి చెందిన డి.సింహయ్య(46) భార్య కుమారి, ఇద్దరు పిల్లలతో కలిసి నగరంలోని యూసఫ్‌గూడ జవహార్‌కాలనీలో నివాసముంటున్నారు. స్థానికంగా వెల్డింగ్ పనులు చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. సింహయ్య మంగళవారం మధ్యాహ్నం మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్లోకుల్ ప్లాట్స్ కాలనీలో ఓ సూపర్ మార్కెట్ భవనం వెనుకవైపు మూడవ అంతస్థు వద్ద భవనానికి సంబంధించిన వెల్డింగ్ పనులు చేస్తుండగా ఒక్కసారిగా అదుపుతప్పి కిందపడిపోయాడు. దీంతో సింహయ్య తలకు, శరీర భాగాలకు గాయాలు కావడంతో అక్కడి స్థానికులు కేపీహెచ్‌బీ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సింహయ్య మృతిచెందినట్లు తెలిపారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు మియాపూర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రెండు ద్విచక్ర వాహనాలు ఢీ..

ఒకరు మృతి, మరో ముగ్గురికి గాయాలు

మియాపూర్: జాతీయ రహదారిపై రెండు ద్విచక్ర వాహనాలు ఒకదానికొకటి ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు మృతిచెందగా మరో ముగ్గురికి స్వల్ప గాయాలైన సంఘటన మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. మియాపూర్‌లో నివాసముంటున్న రవి నాయుడు(25) స్థానికంగా ఓ ప్రైవేటు ఉద్యోగం చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఈ క్రమంలో సోమవారం రాత్రి రవినాయుడు స్నేహితులైనా సాయికుమార్, ప్రసాద్‌తో కలిసి ద్విచక్రవాహనంపై బీహెచ్‌ఈఎల్ వైపు టిఫిన్ చేసేందుకు వెళ్లారు. ముగ్గురు కలిసి ఒకే ద్విచక్ర వాహనంపై టిఫిన్ చేసి మియాపూర్ వైపు వస్తుండగా దీప్తీశ్రీనగర్ సమీపంలో మదీనగూడ జాతీయ రహదారిపై అదుపుతప్పి మరో ద్విచక్రవాహనానికి ఢీకొన్నారు. దీంతో వారు కిందపడగా తీవ్ర గాయాలైయ్యాయి. అక్కడి స్థానికులు దగ్గర్లోని ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ రవినాయుడు మృతి చెందినట్లు తెలిపారు. సాయికుమార్, ప్రసాద్‌కు స్వల్పగాయాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. మరో ద్విచక్ర వాహనాదారుడికి స్వల్ప గాయాలైనట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

వెనుకబడిన విద్యార్థులపై దృష్టి పెట్టాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ వెంకటేశ్వర్లు

పటాన్‌చెరు టౌన్: వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు స్పష్టం చేశారు. అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని కిష్టారెడ్డిపేట, గండిగూడ ప్రభుత్వ పాఠశాలలను మంగళవారం ఆయన సందర్శించి రిజిస్టర్లను తనిఖీ చేశారు. అనంతరం ఉపాధ్యాయుల బోధన తీరును తరగతి గదిలోకి వెళ్లి పరిశీలించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

వెలుగుతున్న విద్యుత్ దీపాలు



నానక్‌రాంగూడ రేషన్‌షాప్ బస్తీలో వెలుగుతున్న వీధిదీపాలు

సాక్షి ఎఫెక్ట్..

రాయదుర్గం: నానక్‌రాంగూడలోని రేషన్‌షాప్ బస్తీలో విద్యుత్ దీపాలు వెలుగుతున్నాయి. దీంతో బస్తీవాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. వీధిదీపాలను జీహెచ్‌ఎంసీ బృందం ఆ ప్రాంతానికి చేరుకొని పరిశీలించి విద్యుత్ దీపాలకున్న బల్బుల స్థానంలో కొత్త వాటిని ఏర్పాటు చేయడంతో అవి వెలుగడం ఆరంభించాయి. 'సాక్షి' శేరిలింగంపల్లి జోన్‌లో ఆదివారం 'వీధి దీపాలు వెలుగడం లేదు' అనే శీర్షిక వచ్చిన వార్తకు జీహెచ్‌ఎంసీ అధికారులు స్పందించి సిబ్బంది చేత వెంటనే బల్బులను ఏర్పాటు చేయడంతో రాత్రిపూట వెలుగులు వచ్చాయని స్థానిక నాయకులు సంజీవరెడ్డి మంగళవారం తెలిపారు.

ప్రశ్నించడమే కవిత్వ ప్రధాన లక్ష్యం



రాయదుర్గం: ప్రశ్నించడమే కవిత్వ ప్రధాన లక్ష్యమని కాళోజీ నారాయణరావు కవిత్వానికి నిర్వచనం చెప్పి ప్రజానీకాన్ని మేల్కొల్పిన వైతాళికుడని హెచ్‌సీయూ తెలుగు శాఖ అధ్యక్షుడు ఆచార్య పిల్లల మర్రి రాములు అభివర్ణించారు. కాళోజీ నారాయణరావు జయంతి సందర్భంగా తెలంగాణ భాషా దినోత్సవాన్ని హైదరాబాద్ విశ్వవిద్యాలయం తెలుగు శాఖ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కాళోజీ నారాయణరావు చిత్రపటానికి పూలమాలలు సమర్పించి ఘనంగా నివాళులర్పించారు. ఆచార్య త్రివేణి, దార్ల వెంకటేశ్వరరావు, ఆచార్య భూక్య తిరుపతి, డాక్టర్ విజయ్‌కుమారి, డాక్టర్ భాశెట్టిలత, ఆచార్య గోనానాయక్, ఆచార్య పమ్మి పవన్ కుమార్, ఆచార్య పి వారిజారాణి, డాక్టర్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.